

చెరువులు, సరస్సులు, వెట్ల్యాండ్స్ పరిరక్షణ ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష

5


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 2 సంచిక -359 బుధవారం13 మే 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# నీట్ పరీక్ష రద్దు

## రాజస్తాన్‌లో ప్రశ్నాపత్రం లీక్ : కేసు నమోదు చేసిన సీబీఐ

**మహారాష్ట్రలో ఒకరి అరెస్ట్**

**ఈనెల 3న దేశవ్యాప్తంగా జరిగిన పరీక్ష**


**22 లక్షల మంది విద్యార్థులకు నిరాశ**

**నిరుత్సాహంలో తల్లిదండ్రులు**

**మోడీ సర్కార్ వైఫల్యాలకు నిదర్శనం**

**మళ్లీ పరీక్ష నిర్వహిస్తాం..**

**: ఎన్‌టీఏ డీజీ అభిషేక్‌సింగ్**




**న్యూఢిల్లీ :మే 12 (జర్నలిస్ట్ వార్త):**
దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మక ప్రవేశపరీక్ష నీట్ యూజీ-2026 రద్దయ్యింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం రాజస్తాన్‌లో లీక్ అయ్యిందనే ఆరోపణలతో ఈ ప్రవేశ పరీక్షను రద్దు చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ఈ నెల 3వ తేదీ జరిగిన నీట్ పరీక్షను దేశవ్యాప్తంగా 22 లక్షలమంది రాసారు. పరీక్షల్ని సమర్థవంతంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రశ్నాపత్రం లీకైన విషయం నిర్ధారణ కాగానే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ కేంద్రాన్ని సంప్రదించారు. కేంద్రం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే ప్రశ్నాపత్రాలు ముద్రించిన నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఒకర్ని అరెస్టు చేసినట్టు తెలిసింది. లీకేజీతో నష్టపోయిన ఆశావాహులకు న్యాయం చేయడానికి త్వరలో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామనీ, దీనికి సంబంధించిన తేదీని త్వరలో ప్రకటిస్తామని ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ప్రక్రియ పదిరోజుల్లో ప్రారంభమవుతుందని తెలిపింది. మళ్లీ పరీక్ష రాయబోయే విద్యార్థులు ఎవరూ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాత రిజిస్ట్రేషన్ డేటానే పరిగణలోకి తీసుకుంటామని**మిగతాది** **2లో...**



# తెలంగాణకు 22, ఏపీకి 10 టీఎంసీలు

## కృష్ణా జలాలు పంపిణీ చేయాలని కేఆర్ఎంబీ నిర్ణయం

**ఈ నెల 14న మరోసారి సమావేశం**

**హైదరాబాద్ మే 12 (జర్నలిస్ట్ వార్త):**
వేసవిలో తాగు నీటి అవసరాలకు గాను తెలంగాణకు 22 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో **మిగతాది** **2లో...**

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

**రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం**

**స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ**

**అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**




**హైదరాబాద్, మే 12 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో**మిగతా** **2లో...**

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

## కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

**సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు**

**ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే**

**అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ**

**లారీలు పంపంకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి**



**హైదరాబాద్, మే 12 (జర్నలిస్ట్ వార్త):**
ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. **మిగతాది** **2లో...**

# బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

**మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణల కేసు**

**మధ్యాహ్నం విచారణకు హాజరు కావాలని నోటీసులు**

**కేసును సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం**



**హైదరాబాద్, మే 12 (జర్నలిస్ట్ వార్త):**
కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడనే ఆరోపణలతో అతనిపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలంటూ సిట్ నోటీసులు పంపించింది.**మిగతాది** **2లో...**

# పార్టీ బలోపేతంపై ఫోకస్

## బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

**ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం నిర్వహించిన కేసీఆర్**

**పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం**

**పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై ఫోకస్**



**హైదరాబాద్, మే 12 (జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం జరిగింది. పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై ఈ భేటీలో స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.
రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం... జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం, అలాగే అంతర్గత కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఈ సంస్థాగత మార్పులు దోహదపడతాయని నాయకత్వం భావిస్తోంది.**మిగతాది** **2లో...**

# దేశవ్యాప్తంగా నిర్మాణాలపై రెండేళ్ల నిషేధం వార్తలను ఖండించిన నీతి ఆయోగ్

**ఈ మేరకు ఎలాంటి సిఫార్సు చేయలేదని ఎక్స్ వేదికగా స్పష్టత**

**పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో నిర్మాణాలు ఆపాలంటూ తప్పుడు ప్రచారం**

**ప్రభుత్వ కార్యాలయాల పునర్నిర్మాణంపై వాయిదా సూచనలు ఇవ్వలేదని వెల్లడి**

**పెరిగిన వ్యయాలు, సరఫరా గొలుసు అంతరాయాలే కారణమంటూ తప్పుడు కథనాలు**

NITI Aayog

# పార్టీ బలోపేతంపై ఫోకస్



(మొదటి పేజీ తరువాయి)
ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి పక్షాల ప్రముఖ నేతలు పాల్గొన్నారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాశ్ ముదిరాజ్, వి. గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోశ్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, ఆర్. శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, టి. జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సురేశ్ రెడ్డి, మహమూద్ అలీ, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మరియు ఇతర రాజకీయ సవాళ్లపై ఈ సమావేశంలో నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రభుత్వ విధానాలపై పోరాటం చేస్తూనే, ప్రజల్లోకి పార్టీని మరింత సమర్థవంతంగా తీసుకువెళ్లేందుకు అవసరమైన ప్రణాళికలను ఈ సమావేశంలో సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాలని, అలాగే జిల్లా పర్యటనల ద్వారా క్యాడర్‌తో నేరుగా మమేకం కావాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.

# బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)
మధ్యాహ్నం రెండు గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది.బండి భగీరథ్ కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుంది. కేసు విచారణ పారదర్శకంగా జరగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీని ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ కేసు సిట్ విచారిస్తోంది. బండి భగీరథ్‌పై బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మరోవైపు, తనను హనీట్రాప్ చేశారని బండి భగీరథ్ కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

### హైకోర్టును ఆశ్రయించిన బండి సంజయ్ కుమారుడు

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.
తనపై నమోదైన కేసులో ఎలాంటి వాస్తవం లేదని, ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 14వ తేదీన (బుధవారం) హైకోర్టు వెకేషన్ బెంచ్‌లో విచారణ జరగనుంది. న్యాయస్థానం ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.
కేసు వివరాల్లోకి వెళితే... ఒక 17 ఏళ్ల మైనర్ బాలికను భగీరథ్ వేధిస్తున్నాడంటూ ఆ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 8వ తేదీన హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అయితే, ఈ ఆరోపణలను భగీరథ్ తరపున వర్గాలు ఖండిస్తున్నాయి. ఇది కావాలని చేస్తున్న కుట్రగా వారు పేర్కొంటున్నారు.
మరో ఆసక్తికరమైన మలుపు ఏంటంటే... ఆ బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని భగీరథ్ కూడా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అదే రోజు (మే 8) కరీంనగర్ పోలీసులు బాలిక, ఆమె తల్లిపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల విచారణ ప్రస్తుతం కొనసాగుతోంది.

# దేశవ్యాప్తంగా నిర్మాణాలపై రెండేళ్ల నిషేధం వార్తలను ఖండించిన నీతి ఆయోగ్

**ఈ మేరకు ఎలాంటి సిఫార్సు చేయలేదని ఎక్స్ వేదికగా స్పష్టత**

**పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో నిర్మాణాలు ఆపాలంటూ తప్పుడు ప్రచారం**

**ప్రభుత్వ కార్యాలయాల పునర్నిర్మాణంపై వాయిదా సూచనలు ఇవ్వలేదని వెల్లడి**

**పెరిగిన వ్యయాలు, సరఫరా గొలుసు అంతరాయాలే కారణమంటూ తప్పుడు కథనాలు**

**న్యూఢిల్లీ, మే 12 (జర్నలిస్ట్ వార్త):**
దేశవ్యాప్తంగా నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలను రెండేళ్ల పాటు నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు వస్తున్న వార్తలను నీతి ఆయోగ్ తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని మంగళవారం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది.పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా దేశంలో నిర్మాణాలను రెండేళ్లు నిలిపివేయాలని నీతి ఆయోగ్ సలహా ఇచ్చినట్లు మే 12న ఒక మీడియా కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని ఉటంకిస్తూ స్పందించిన నీతి ఆయోగ్, "నిర్మాణాలపై నిషేధం విధించాలని మా సంస్థ ఎలాంటి సిఫార్సు చేయలేదని స్పష్టం చేస్తున్నాం" అని పేర్కొంది.ముఖ్యంగా, ఢిల్లీలోని నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్, శాస్త్రి భవన్ వంటి కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల కూల్చివేత, పునర్నిర్మాణ ప్రాజెక్టులను వాయిదా వేయాలని సూచించినట్లు ఆ కథనంలో పేర్కొన్నారు. అయితే, ఈ భవనాల పునర్నిర్మాణ ప్రణాళికలను సంబంధిత మంత్రిత్వ శాఖలే చూసుకుంటున్నాయని, ఆ ప్రక్రియను వాయిదా వేయాలని తాము ఎలాంటి సూచన చేయలేదని నీతి ఆయోగ్ తేల్చిచెప్పింది.పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, ఇంధన వాడకాన్ని తగ్గించుకోవాలని, విదేశీ ప్రయాణాలను పరిమితం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో నిర్మాణాలను నిలిపివేయాలన్న వదంతులకు ప్రాధాన్యత ఏర్పడింది. తాజాగా నీతి ఆయోగ్ ప్రకటనతో ఈ ప్రచారానికి తెరపడినట్లయింది.?

# తెలంగాణకు 22, ఏపీకి 10 టీఎంసీలు

(మొదటి పేజీ తరువాయి)
జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, ఏ రాష్ట్రానికి ఎంత నీరు విడుదల చేయాలనే అంశంపై చర్చించి ఈ వేసవి వాటాలను బోర్డు నిర్ణయించింది. తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి 10 టీఎంసీలు ఏపీకి, తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 5 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతిచ్చింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలిపిన తెలంగాణ, సాగర్‌లో ఏపీకి 10 టీఎంసీలు పోగా మిగిలిన మొత్తం నీరు తమకే చెందుతుందని వాదించింది. తాగునీటి అవసరాల కోసం నీటిని అడుగుతున్నట్టు ఏపీ ఈఎన్సీ తెలిపారు. మిగతా అంశాలు కాకుండా అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకుందామని బోర్డు సభ్య కార్యదర్శి తెలిపారు. దాంతో రెండు రాష్ట్రాలు బోర్డు నిర్ణయాన్ని అంగీకరించారు. కాగా తమకు 18 టీఎంసీలు కావాలని తెలంగాణ అభ్యర్థించగా, మరో మూడు టీఎసీలు అదనంగా కేటాయించడం గమనార్హం. ఈ ఒప్పందం ఆగస్టు 15 వరకు అమల్లో ఉంటుందని కేఆర్ఎంబీ వర్గాలు తెలిపారు. ఈ నెల 14న కేఆర్ఎంబీ 21వ సమావేశం జరగనుంది. కృష్ణానది నీటి వాటాలు, శ్రీశైలం, నాగార్జున సాగర్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజు, తెలంగాణ, ఏపీలకు చెందిన ఈఎన్సీలు రమేశ్‌బాబు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష రద్దు- సిబిఐ విచారణ

(మొదటి పేజీ తరువాయి)
కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.
కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకుని పరిశీలించిన సమాచారంతో పాటు, చట్ట సంస్థలు పంచుకున్న దర్యాప్తు వివరాల ఆధారంగా మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ అనుమతితో నిర్ణయించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ ఏడాది నీట్-యూజీ పరీక్ష దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో సుమారు 23 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు నమోదు చేసుకున్నారు. చట్ట అమలు సంస్థల నుంచి అందిన సమాచారం, దర్యాప్తు సంస్థల నివేదికలను సమగ్రంగా పరిశీలించిన తరువాత ప్రస్తుతం నిర్వహించిన పరీక్షా ప్రక్రియను కొనసాగించడం సాధ్యం కాదని తేలినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. మళ్లీ నిర్వహించే పరీక్ష తేదీలు, కొత్త అడ్మిట్ కార్డుల విడుదల షెడ్యూల్‌ను త్వరలో అధికారిక మార్గాల ద్వారా వెల్లడిస్తామని తెలిపింది, ఇక ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగిస్తూ సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. దర్యాప్తుకు అవసరమైన అన్ని రికార్డులు, పత్రాలు, సహాయాన్ని సీబీఐకి పూర్తిగా అందజేస్తామని సంస్థ స్పష్టం చేసింది. జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని పరిరక్షించడం, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేసినట్లు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) తెలిపింది.పరీక్షను మళ్లీ నిర్వహించడం వల్ల విద్యార్థులు, వారి కుటుంబాలు నిజమైన ఇబ్బందులు ఎదుర్కొంటారని అంగీకరించిన ఎన్‌టీఏ, అయితే పరీక్షా వ్యవస్థపై నమ్మకానికి దీర్ఘకాలిక నష్టం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తప్పనిసరి అయిందని పేర్కొంది. కొత్తగా పరీక్ష రాసేందుకు విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కరలేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తరువాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

(మొదటి పేజీ తరువాయి)
ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

## ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు -ఎన్‌డిఎ ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక

**గౌహతి, మే 12 (జర్నలిస్ట్ వార్త):** : అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు.అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు.
హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్



బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ,



బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)
మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్ధిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.

# ప్రజల త్రాగునీటి సమస్యలకు నూతన బావితో పరిష్కారం.

## -సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్.

**బయ్యారం/,మే 12.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం కొత్తపేట గ్రామ ప్రజలకు త్రాగునీటీ సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ చేసిన భగీరథ ప్రయత్నంలో భాగంగా కొత్తపేట కుంటలో మంచినీటి బావిని తవ్వించారు.గ్రామ ప్రజల త్రాగునీటి కొరతను తీర్చుట కొరకు తవ్వించిన బావిలో నీరు సంమృద్ధిగా పడడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ శుభ సందర్భంగా సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ నూతన బావిని సందర్శించి సంతోషం వ్యక్తం చేసి గ్రామస్తులకు శుభవార్త తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రావి వీరభద్ర



రావు,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వడ్లమూడి కోటేశ్వరరావు,బుర్ర దుర్గారావు, పెంటాల



శ్రీనివాసరావు,కంచర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పే నియర్ యాప్ తో నిరక్షరాస్యులు, వృద్ధులు,

# రైతులే లక్ష్యంగా భారీ దోపిడీ..?

**-ఆధార్ బయోమెట్రిక్ దుర్వినియోగం.**
**-దొంగచాటుగా డబ్బు డ్రా..**
**-గిరిజన నిరక్షరాస్యలే వారికి టార్గెట్..!**
**-బయోమెట్రిక్ వేలిముద్రతో యాప్ నిర్వాహకుడికి కావాల్సినంత మనీ డ్రా...!**
**-బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు.**


**బయ్యారం/,మే 12.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామపంచాయతీ పరిధిలో పే నియర్ బై యాప్ తో సామాన్యుల బ్యాంకు ఖాతాల సొమ్మును దొంగిలిస్తూ అడ్డంగా దొరికిన సదరు యాప్ నిర్వాహకుడు. వివరాల్లోకి వెళితే అల్లిగూడెం, రామచంద్రాపురం,మొట్ల తిమ్మాపురం, భద్రుతండ,రెడ్యా తండా,కస్తూరి నగరం, సింగారం, పెంకుతండా గ్రామాలలో సామాన్యుల బ్యాంకు ఖాతాలలో వారి అనుమతి లేకుండానే బయోమెట్రిక్ పై వేలిముద్ర వేసి ఖాతాలో ఉన్న డబ్బులను తక్కువ చూపి చెబుతూ వారి డబ్బులను దర్జాగా యాప్ నిర్వాహకుడి ఖాతాలోకి బదిలీ చేసినట్లు అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. భద్రతండకు చెందిన ధరమ్ సోత్ హరిలాల్ ఈ నెల 1న తమ ఆధార్ కార్డు వెంటబెట్టుకొని పే నియర్ యాప్ ద్వారా మినీ బ్యాంక్ సెంటర్ నడుపుతున్న తొట్టి అశోక్ దగ్గరికి వెళ్లి తమ ఖాతాలో సొమ్ము వివరాలను చెప్పమని అడగ్గా ఖాతాలో సొమ్ము 2700 ఉండగా 2020 రూపాయలు ఉన్నాయని చెప్పి బాధితుడికి 2000 ఇచ్చి 700 రూపాయలు తమ ఖాతాలో జమ చేసుకున్నట్లు తెలియడంతో తమ సొమ్మును అక్రమంగా కాజేశాడని ఈనెల 11న స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.పెంకుతండకు చెందిన గూగులోత్ దస్మా ఈ నెల 2వ తేదీన తమ ఆధార్ కార్డు తీసుకొని హర్షిత మినీ బ్యాంకు కు వెళ్లి తమ ఖాతా వివరాలను చూడమని తొట్టి అశోక్ అడగ్గా ఖాతాలో 4500 రూపాయలు ఉన్నాయని 4000 రూపాయలు ఖాతాదారుడికి ఇచ్చినట్లు సమాచారం...అసలు ఖాతాలో 6000 రూపాయలు ఉండగా 4500 చూపెట్టి 1500 రూపాయలు కాజేశాడనే ఖాతాదారుడు వాపోయాడు.ఇలా ఒకే నెలలో ఐదు నుంచి పది మంది నిరక్షరాస్యుల ఖాతాలో వారికీ తెలియకుండా డబ్బులు డ్రా చేస్తూ గత పది సంవత్సరాల నుండి పే నియర్ యాప్ ద్వారా మినీ బ్యాంకు సెంటర్ నడుపుతూ మండలంలో వేలాది మంది ఖాతాల నుండి కోట్ల రూపాయలు దోపిడీ చేసినట్లు పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.మినీ బ్యాంకు మనీ దోపిడి పై ఒక్కొక్కరుగా బాధితులు స్థానిక పోలీస్ స్టేషనులో ఇప్పటి వరకు ముగ్గురు ఫిర్యాదు చేసినట్లు బాధితుల నుండి సమాచారం.మరి కొంతమంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రామచంద్రపురంలో మినీ బ్యాంక్ దోపిడి పై లోతుగా విచారణ జరిపి ఖాతాదారులకు తెలియకుండా ఆర్థిక నేరం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు పోలీసులను వేడుకుంటున్నారు. దీనిపై యాప్ నిర్వాహకుడు తొట్టి అశోక్ తన అసలు బండారం బయటకు పడకుండా గుగులోతు రాజలి సంబందించిన డబ్బులు దొంగతనంగా కొట్టేసిన మహిళ కాళ్లా, వేల్లా..బ్రతిమలాడుతూ వారికి రాజకీయ నాయకులతో ఫోన్ల ద్వారా బెదిరింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.కేసును వాపస్ తీసుకోమని నా పరువు తీయవద్దని వేడుకుంటున్నట్లు గ్రామస్తుల నుండి సమాచారం.పే నియర్ యాప్ నిర్వాహకులు మినీ సెంటర్ ఐడిని బ్లాక్ చేసినట్లు సమాచారం.గత పది సంవత్సరాల నుండి రైతులకు, కూలీలకు,రైతుబంధు పథకం,గ్రామీణ ఉపాధి హామీ పథకం,రైతుల ధాన్యం విక్రయాలు,తునికాకు సేకరణ డబ్బులు గిరిజనుల ఖాతాల్లో పడడం గిరిజనులు సదరు యాప్ నిర్వాహకుడు దగ్గరికి వెళ్లడం మోసపోవడం గ్రామస్తులు గ్రహించలేకపోయారు.దీనిపై ఎస్ఐ ప్రశాంత్ బాబు వివరణ కోరగా కొంతమంది బాధితులు తమ డబ్బులు మినీ బ్యాంకు నిర్వాహకుడు దొంగిలించడని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు.

**బయ్యారం/,మే 12.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.శ్రీ కోదండసీతరామచంద్రస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ కార్యక్రమంతో ప్రారంభమైన అభిషేక కార్యక్రమాలు,ప్రత్యేక అర్చన, పూజ కార్యక్రమాలు నిర్వహించుకొని కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్బంగా భారీ బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా ఆలయం భక్తులతో శోభాయమానంగా విరజిల్లిందని ఆలయ అర్చకులు సుదర్శన చార్యులు తెలిపారు.బైక్ ర్యాలీ ని ఆలయ కమిటీ వారు ప్రారంభించారు.రామాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ మీదుగా




జగ్గుతండ నుండి గాంధీ సెంటర్ వయా శివాలయం మీదుగా భక్తులు బైకులతో తిరిగి రామలయానికి చేరుకున్నారు.దారి పొడవునా జై శ్రీరాం..జై హనుమాన్ నినాదాలతో మండల కేంద్రం



హోరెత్తింది.ధర్మం కోసం హిందువులందరూ ఏకతాటిపైకి రావాలని నినాదాలు చేశారు.భక్తి శ్రద్ధలతో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు,యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి -కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్ యాదగిరి**







**వేలేరు/, మే 12 (జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మండల సర్పంచుల వేదిక అధ్యక్షుడు, వేలేరు ప్రధాన గ్రామపంచాయతీ సర్పంచ్ మీబిళ్ల యాదగిరి మంగళవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వడ్ల తూకం, తరలింపు ప్రక్రియపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ ఇప్పటివరకు ఈ ఒక్క కొనుగోలు కేంద్రం ద్వారానే 6,514 క్వింటాళ్ల వడ్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చినట్లు వెల్లడించారు.
వడ్ల కొనుగోళ్ల విషయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక దృష్టి సారించారని, జిల్లా స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మరో వారం రోజుల్లో రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చే రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే ఏర్పాట్లు, తూకం సౌకర్యాలు సమృద్ధిగా కల్పించాలని కొనుగోలు కేంద్ర కమిటీ సభ్యులకు సూచించారు. ధాన్యం తరలింపులో ఆలస్యం జరగకుండా చూడాలని, రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితి రాకూడదని అన్నారు.ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు కూడా ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# పదవీ బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ కృష్ణారెడ్డి



**వైరా/, మే 12 (జర్నలిస్ట్ వార్త):**
మండల పరిధిలోని గరికపాడు సహకార సంఘ పాలకవర్గం తిరిగి పదవీ బాధ్యతలు స్వీకరించింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు పాత సహకార సంఘ పాలకవర్గాన్ని కొనసాగించేందుకు అనుమతి ఇవ్వడంతో సంఘ కార్యకలాపాలను యథావిధిగా నిర్వహించేందుకు సంఘ చైర్మన్ అయిలూరి కృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, రైతులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు, గరికపాడు సర్పంచ్ శ్రీమతి లక్కిరెడ్డి నాగలక్ష్మి, లింగన్నపాలెం సర్పంచ్ పరశురాముడు, దాచాపురం సర్పంచ్ శ్రీమతి గూడూరు వెంకట్రావమ్మతో పాటు నాలుగు గ్రామాల సంఘ సభ్యులు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే రాగమయి



**తల్లాడ, /మే 12 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం అంజనాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమినేని ప్రభాకర్, వైరా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దున్నేటి వీరారెడ్డి, ఉపసర్పంచ్ బండి బాలశౌరి, వైరా మార్కెట్ వైస్ చైర్మన్ కాప సుధాకర్, దాసు రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రైస్తవులకు సమాధుల స్థలం కేటాయించాలి

## కలెక్టర్‌కు క్రైస్తవ నాయకుల వినతి




**ఖమ్మం,/ మే 12 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం పట్టణంలోని క్రైస్తవులకు సమాధుల స్థలం కేటాయించాలని జిల్లా క్రైస్తవ నాయకులు కలెక్టర్‌ను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వివిధ పాస్టర్స్ ఫెలోషిప్‌ల అధ్యక్షులు, క్రైస్తవ ముఖ్య నాయకులు కలెక్టర్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం తెలంగాణ దళిత క్రైస్తవ హక్కుల సాధన కమిటీ, జిల్లా ఆల్ పాస్టర్స్ ఫెలోషిప్‌ల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.దళిత క్రైస్తవుల హక్కుల సాధన కోసం ఇటీవల నిర్వహించిన శాంతి ర్యాలీ విజయవంతమైందని పేర్కొన్నారు. క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ముఖ్యంగా ఖమ్మం పట్టణంలో సమాధుల స్థలం లేక క్రైస్తవులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా క్రైస్తవ నాయకులు పల్లా రాజశేఖర్, వేముల సత్యం, జేకర్యా, హనుమంతరావు, నేలాల బాలస్వామి, ఆనందరావు, పాల్ బాలస్వామి, కొమ్ము బాబురావు, రాధాకృష్ణ, రాజరత్నం, రాంబాబు, సురేష్, జి. రత్నం, కనపర్తి సంజీవరావు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# మహానాడుకు పోటెత్తుతున్న తెలుగు తమ్ముళ్లు



**మధిర, /మే 12 (జర్నలిస్ట్ వార్త):** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మక మహానాడు ఏర్పాట్లుఊపందుకున్నాయి. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరు జిల్లా కిసాన్ సెజ్‌లో నిర్వహించనున్న మహానాడును విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కసరత్తు ముమ్మరం చేశాయి. ఇందుకోసం తెలంగాణ రాష్ట్రం నుంచి 20 కమిటీలను ఏర్పాటు చేయగా, నాయకులు, కార్యకర్తలు భారీగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.మహానాడు సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా పొగాకు జయరామ్ చందర్‌ను పార్టీ అధిష్ఠానం నియమించడంతో తెలుగు తమ్ముళ్లలో ఆనందం వ్యక్తమవుతోంది. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించడం సముచితమని నాయకులు పేర్కొన్నారు.జయరామ్ చందర్ ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమాలు విజయవంతమవుతాయని మధిర నియోజకవర్గ యువ నాయకుడు శివ ఆశాభావం వ్యక్తం చేశారు. మహానాడును విజయవంతం చేయాలనే లక్ష్యంతో కార్యకర్తలు, అభిమానులు సభా ప్రాంగణానికి పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారు.

## నవ దంపతులను ఆశీర్వదించిన మార్నేని



**పర్వతగిరి/మే 12(జర్నలిస్ట్ వార్త)::**మండలంలోని దేవిలాల్ తండకు చెందిన జాటోతు నీలమ్మ-ధర్మానాయక్ దంపతుల ప్రథమ కుమారుడు రాజు నాయక్, సౌందర్యల వివాహ రిసెప్షన్ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన దంపతులకు శు భాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, ప్రజా ప్రతినిధులు కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నారాయణ రెడ్డి భౌతికకాయానికి వెంకటయ్య నివాళి

**వర్ధన్నపేట/మే 12 (జర్నలిస్ట్ వార్త):**



మండలంలోని కాడారిగూడెం గ్రామానికి చెందిన సంధి నారాయణ రెడ్డి మృతి చెందగా, మంగళవారం ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు ఆయన బాధితుడి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి అక్బర్, వార్డు సభ్యులు ఎండి రషీద్, జర్నలిస్టు బుర్ర వెంకట రమణ గౌడ్ తదితరులు పాల్గొని నివాళు లర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు

# పెళ్లి పేరుతో వంచన యువతిపై లైంగిక దాడి

### గీసుగొండలో ముగ్గురిపై కేసు నమోదు

**గీసుగొండ/మే 12(జర్నలిస్ట్ వార్త):** ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన తుప్పరి ఉదయ్ శంకర్ (29)కు బాధితురాలితో పదో తరగతి నుంచే పరిచయం ఉంది. ఈ క్రమంలో ఆమెను ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని నమ్మిస్తూ వచ్చాడు.

పెళ్లి చేసుకుంటాననే హామీ ఇచ్చి, ఆమెను బెదిరిస్తూ పలుమార్లు బలవంతంగా శారీరక సంబంధం పెట్టుకున్నాడు. బాధితురాలు పెళ్లి విషయం ప్రస్తావించగా. ఆమె ఫోటోలను సోషల్ మీడియాలో పెడతానని, కుటుంబ సభ్యులను చంపేస్తానని వేధింపులకు గురిచేశాడు. ఈ క్రమంలో గత నెల 24వ తేదీ రాత్రి నిందితుడు యువతి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించగా. స్థానికులు అతడిని పట్టుకున్నారు. అప్పుడు కూడా తాను సదరు యువతిని వివాహం చేసుకుంటానని అందరి ముందూ నమ్మబలికాడు.మరుసటి రోజు (ఏప్రిల్ 25న) బాధితురాలి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి నిందితుడి నివాసానికి వెళ్లి పెళ్లి విషయమై మాట్లాడారు. అయితే నిందితుడు ఉదయ్ శంకర్, అతని తండ్రి సమ్మయ్య, అక్క అన్నపూర్ణలు కలిసి యువతిని తీవ్రంగా దూషించి, చంపుతామని బెదిరించారు. దీంతో బాధితురాలు గీసుగొండ పోలీసులను ఆశ్రయించింది.

యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు ఉదయ్ శంకర్‌తో పాటు అతనికి సహకరించిన తండ్రి సమ్మయ్య, అక్క అన్నపూర్ణలపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని అదుపులోకి తీసుకుంటామని గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ పత్రికా ప్రకటనలో తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

# బాలికల సాధికారతకే స్నేహ సమ్మర్ క్యాంపులు

**పర్వతగిరి/మే12(జర్నలిస్ట్ వార్త):**



బాలికలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి సాధికారత సాధించాలని సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాలు, డీఆర్డీఓ నాగపద్మజ సూచనల మేరకు జిల్లావ్యాప్తంగా 15-18 ఏళ్ల బాలికల కోసం నిర్వహిస్తున్న 'స్నేహ సమ్మర్ క్యాంపుల్లో భాగంగా మంగళవారం అనంతారం, గోపనపల్లి, కొంకపాక గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. గోపనపల్లి వెలుగు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. కౌమార దశలో ఎదురయ్యే శారీరక, మానసిక మార్పులపై బాలికలకు అవగాహన కల్పించారు. 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' పట్ల అప్రమత్తంగా ఉండాలని, రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని కోరారు. ఆటపాటలతో కూడిన ఈ శిబిరాల్లో బాలికల ఆసక్తికి అనుగుణంగా లక్ష్య సాధన దిశగా మార్గనిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు శ్యామ్, దేవేంద్ర, సుధాకర్, వీఓఏలు మౌనిక, లావణ్య, సంతోష, సంధ్య, రాజేశ్వరి, జోష్ణ, శ్రావణి, యశోద, కరుణ, ఉమా, రాధిక బాలికలు పాల్గొన్నారు.

# భూమి కబ్జా చేశారని బాధితుడి ఆవేదన

### న్యాయం చేయాలని అధికారుల చుట్టూ పోచయ్య ప్రదక్షిణలు

**ఎల్కతుర్తి,/ మే 12 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన ఇల్లందుల పోచయ్య తన ఎకరం పది గుంటల భూమిని అన్న ఇల్లందుల లింగయ్య దొంగ పట్టాతో కబ్జా చేశాడని ఆరోపించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదని బాధితుడు వాపోయాడు.






ఈ సందర్భంగా భూభారతి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రఘు మాట్లాడుతూ మండలంలో భూముల కబ్జా వ్యవహారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ కబ్జాదారులకు కొందరు అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయంలో డబ్బుల కోసం నిబంధనలు పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. భూముల సమస్యల పరిష్కారంలో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని, క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలు కాకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్డీవో, కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యకు పరిష్కారం దొరకలేదని పోచయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడికి వెంటనే న్యాయం చేసి, భూమి కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గడ్డం రఘు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

## నర్సంపేట కళాశాల ప్రధానాచార్యుడికి రాష్ట్ర ఉత్తమ పురస్కారం

**నర్సంపేట,/ మే 12 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయంప్రతిపత్తి ప్రధానాచార్యుడు ఆచార్య మల్లం నవీన్‌కు తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రధానాచార్య పురస్కారం లభించింది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-విద్యా వారోత్సవాలు" కార్యక్రమంలో భాగంగా ఈ గౌరవాన్ని ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ క్రీడా మైదానంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆచార్య మల్లం నవీన్ పురస్కారాన్ని అందుకున్నారు. కళాశాల అభివృద్ధి కోసం లక్ష రూపాయల ప్రోత్సాహక నిధితో పాటు పది వేల రూపాయల నగదు చెక్కును కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య మల్లం నవీన్ మాట్లాడుతూ, ఈ పురస్కారం తనకే కాకుండా




కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషికి దక్కిన గుర్తింపని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలు కూడా సంకల్పం, క్రమశిక్షణ, అంకితభావంతో రాష్ట్రానికి ఆదర్శంగా నిలవగలవని తమ కళాశాల నిరూపించిందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం తమ బాధ్యత మాత్రమే కాక లక్ష్యమని తెలిపారు. ప్రతి తరగతి గదిని స్ఫూర్తి కేంద్రంగా, ప్రతి విద్యార్థిని నాయకుడిగా తీర్చిదిద్దే దిశగా కృషి కొనసాగిస్తామని చెప్పారు. విద్యా ప్రమాణాలు, పరిశోధన, సాంకేతిక వనరులు, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తెలంగాణలోనే అత్యుత్తమ విద్యాసంస్థగా నిలబెట్టడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ అధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేయాలి

### పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్ డిమాండ్

**నర్సంపేట/, మే 12 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం నర్సంపేటలో న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మైనర్ బాలికకు బలవంతంగా మత్తు పదార్థాలు ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడనే ఆరోపణలతో బండి సాయి భగీరథపై హైదరాబాద్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 8న పోక్సో కేసు నమోదైందన్నారు. కేసు నమోదై మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. పోక్సో చట్టం ప్రకారం బాధితురాలి వాంగ్మూలాన్ని న్యాయమూర్తి ఎదుట నమోదు చేసి, నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకుని విచారణ జరపాల్సి ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో కూడా బండి సాయి భగీరథ చదువుకున్న కళాశాలలో విద్యార్థులపై వేధింపులు, దాడులకు పాల్పడ్డాడనే




ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. ఇప్పుడు మైనర్ బాలికపై అత్యాచారం చేశాడంటూ కేసు నమోదవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు.

కేసు నుంచి తప్పించుకునేందుకు బాధితురాలిపైనే హనీట్రాప్ ఆరోపణలతో ప్రతికేసు పెట్టడం దుర్మార్గమని అజయ్ మండిపడ్డారు. రాజకీయ, ఆర్థిక ప్రభావంతో కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధిత మైనర్ బాలికకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించి, కేసును నిష్పక్షపాతంగా విచారించాలని కోరారు. సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహేష్, పవన్, వినయ్, నవీన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ లీకేజీకి భాజపానే బాధ్యత

### విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం -కుల్ల యాకాంతం


**వర్ధన్నపేట/మే 12(జర్నలిస్ట్ వార్త):** నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం ప్రదర్శించిన నిర్లక్ష్యం వల్ల దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కుల్ల యాకాంతం మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడి చదివి రాసిన పరీక్ష. పేపర్ లీకేజీల వల్ల రద్దు కావడమనేది విద్యా వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు.

భాజపా సారథ్యంలోని ప్రభుత్వ వైఫల్యం వల్ల విద్యార్థుల కఠోర శ్రమ బూడిదలో పోసిన పన్నీరైందని ఆయన ధ్వజమెత్తారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు అప్పులు చేసి, నగలు అమ్ముకుని చదివించారని. తీరా పరీక్ష



సమయానికి పేపర్ మాఫియా చేతిలో విద్యా వ్యవస్థ బందీ కావడం దారుణమన్నారు. ప్రధాని మోదీ చెబుతున్న అమృత్ కాల్ విద్యార్థుల పాలిట విష కాలం గా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. పేపర్ మాఫియా ఎలాంటి శిక్ష లేకుండా తప్పించుకు తిరుగుతుంటే, నిజాయతీగా చదివే విద్యార్థులు శిక్ష అనుభవిస్తున్నారని యాకాంతం పేర్కొన్నారు. డబ్బు, పలుకుబడితో విద్యార్థుల తలరాతలను మారుస్తుంటే సామాన్య, గ్రామీణ విద్యార్థులకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఈ లీకేజీ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పునఃపరీక్ష వల్ల విద్యార్థులపై పడే అదనపు ఆర్థిక, మానసిక భారాన్ని కేంద్రమే బాధ్యత వహించాలని కోరారు.

# పలు శుభకార్యాలకు హాజరైన ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్





**మధిర/, మే 12 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ మంగళవారం మధిర పట్టణంలో పలు శుభకార్యాలకు హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా మధిర పట్టణ ప్రముఖులు ఆయనను ఘనంగా సన్మానించారు.

మధిర మున్సిపల్ కౌన్సిలర్లు బోడేపూడి రేవతి, వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, ములకలపల్లి వినయ్ కుమార్‌లు జవహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. శుభకార్యాల నిమిత్తం మధిర మున్సిపల్ పరిధిలోని జిలుగుమాడు గ్రామానికి వచ్చిన జవహర్‌కు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జిలుగుమాడు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర టౌన్, రూరల్ మండలాల టీడీపీ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు, మార్నీడు పుల్లారావు, జిల్లా నాయకులు వంగాల రామకోటి, టీడీపీ నాయకులు రావూరి రంగయ్య, వేల్పుల కొండ, వినుకొండ కృష్ణమూర్తి, సట్టు వెంకటేశ్వర్లు, మన్నేపల్లి రత్నకుమారి, పాశం రామనాథం, బోడేపూడి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, కేశవపట్ల రామయ్య, శ్రీను, షఢిక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన మొక్కజొన్న రైతు..

## ఐనవోలులో జాతీయ రహదారి దిగ్బంధం



**ఐనవోలు/మే 12(జర్నలిస్ట్ వార్త):** ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాతలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంతిని గ్రామంలో బుధవారం మొక్కజొన్న రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సాగుతున్న తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. మొక్కజొన్న కొనుగోళ్లలో అధికారులు, కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ రైతులు తమ పంటతో నిండిన ట్రాక్టర్లను రహదారిపై అడ్డంగా నిలిపారు. రోడ్డుపైనే బైఠాయించి ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో రాకపోకలు కిలోమీటర్ల మేర స్తంభించిపోయాయి.

రోజుల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా, తేమ శాతం నెపంతోనో లేక ఇతర కారణాలతోనో కొనుగోలు ప్రక్రియను నిలిపివేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికొచ్చి రోజులు గడుస్తున్నా.. అమ్ముకునేందుకు అగచాట్లు తప్పడం లేదు. వర్షం వస్తే మా పరిస్థితి ఏంటి? అని అధికారులను నిలదీశారు. కనీసం బస్తాలు కూడా ఇవ్వడం లేదని, తూకంలో జాప్యం వల్ల తరుగు వస్తోందని వాపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామని, తూకంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. వెంటనే తూకం ప్రారంభించాలని, అకాల వర్షాల ముప్పు ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన పంటను తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# చుట్టూ చేరే భజన బృందం..

# తస్మాత్ జాగ్రత్త...



నమ్మకం అనేది ఒక అందమైన భ్రమ. అది ఉన్నప్పుడు ప్రపంచమంతా చుట్టూ ఉన్నట్టే ఉంటుంది. కానీ అది విచ్ఛిన్నమైనప్పుడు మాత్రమే మనిషి ఒంటరితనం విలువ తెలుస్తుంది. సమాజంలో మన వెంటే ఉంటూ, మన నీడలా కనిపిస్తూ, అనుక్షణం మనల్ని పొగిడే వారందరూ మన శ్రేయోభిలాషులు కాదనే చేదు నిజాన్ని గుర్తించడంలోనే మనిషి విజ్ఞత దాగి ఉంది.

**అతి నమ్మకం ఆత్మవంచనకే తొలిమెట్టు**

మానవ సంబంధాల్లో నమ్మకం పునాది వంటిది. అయితే, ఆ పునాది ఎంత లోతుగా ఉండాలో, అంతే పటిష్టంగా ఉండాలి. నేటి కాలంలో ఎదుటివారి అంతరంగాన్ని చదవకుండా, కేవలం వారి మాటల గారడీని చూసి గుడ్డిగా నమ్మడం ఆత్మహత్యాసదృశ్యమే అవుతుంది. ముఖ్యంగా మన చుట్టూ ఎప్పుడూ తిరుగుతూ, మన ప్రతి పనినీ సమర్థిస్తూ, భజన చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వీరు చేసే అతిశయోక్తి పొగడ్తలు మన కళ్లకు అహంకారం అనే పొరను కమ్మేస్తాయి. ఫలితంగా మనలోని తప్పులను మనం చూసుకోలేము.

**ముంచేసేది ముఖస్తుతి చేసేవారే**

చరిత్రను ఒకసారి పరిశీలిస్తే, గొప్ప రాజ్యాల పతనానికి శత్రువుల కన్నా సొంత మనుషుల వెన్నుపోటులే కారణమని అర్థమవుతుంది. మన ముందు వినయ విధేయతలు ప్రదర్శించేవారు, మన అధికారాన్ని లేదా సంపదను చూసి ఆకర్షితులైన వారే తప్ప, మన వ్యక్తిత్వాన్ని ప్రేమించేవారు కాదు. నోరు తీయగా ఉన్నవారందరూ మనసు మంచి వారు కాకపోవచ్చు అన్న పెద్దల మాట అక్షర సత్యం. మనల్ని ఆకాశానికి ఎత్తేసేవారే, సమయం వచ్చినప్పుడు పాతాళానికి తొక్కేయడానికి వెనుకాడరు. ఎందుకంటే, వారి బంధం స్వార్థంతో ముడిపడి ఉంటుంది. స్వార్థం తీరగానే, వారు తమ అసలు స్వరూపాన్ని బయటపెడతారు.

**నిజమైన మిత్రుడు విమర్శిస్తాడు**

నిజమైన శ్రేయోభిలాషి మనల్ని పొగడటం కంటే, మనల్ని సరిదిద్దడానికే ప్రయత్నిస్తాడు. మన తప్పును ఎత్తిచూపే వ్యక్తి శత్రువులా అనిపించినా, అతడే అసలైన రక్షకుడు. కానీ, చుట్టూ చేరి జీ హుజూర్ అనే వారు మన పతనాన్ని చూసి ఆనందించే మనస్తత్వం కలవారు. భజన చేసే వారు ముందు వరుసలో ఉండి మనల్ని ప్రమాదంలోకి నెట్టేస్తారు. కష్టకాలం వచ్చినప్పుడు ఆ భజన బృందం ఒక్కొక్కటిగా మాయమైపోతుంది. తీరా మనం మునిగిపోయాక గానీ, మనం ఎంతమంది ద్రోహుల మధ్య ఉన్నామో అర్థం కాదు.

**విజ్ఞతతో వ్యవహరించాలి**

అందరినీ ప్రేమించాలి, కానీ కొందరిని మాత్రమే నమ్మాలి. మన వ్యక్తిగత విషయాలను, బలహీనతలను అందరి ముందు ఉంచకూడదు. ఎవరిని ఎంత వరకు దగ్గరకు తీయాలో ఒక గీత గీసుకోవాలి. ఆడంబరమైన మాటలకు లోబడకుండా, మౌనంగా ఉండి మనల్ని గమనించే వ్యక్తులకే ప్రాధాన్యత ఇవ్వాలి. మన చుట్టూ ఉన్న వారి మాటల వెనుక ఉన్న అంతరార్థాన్ని గ్రహించగలిగిన రోజే మనం వంచనకు గురికాకుండా ఉంటాం. జీవిత ప్రయాణంలో తోడుండేవారు కావాలి, కానీ ఆ తోడు వెనుక ద్రోహం ఉండకూడదు. పొగడ్తలతో ముంచేసే వారి కంటే, నిజాయితీగా విమర్శించే వారే మిన్న. చుట్టూ ఉన్న జన సమూహాన్ని చూసి మనల్ని అందరూ ప్రేమిస్తున్నారని భ్రమపడకుండా. ఎవరు మన శ్రేయస్సు కోరుతున్నారో, ఎవరు వెనుక నుంచి గోతులు తవ్వుతున్నారో గుర్తించడమే నిజమైన జీవన నైపుణ్యం. అతిగా నమ్మడం అంటే మన ఓటమికి మనమే బాటలు వేసుకోవడం అని మరవకూడదు.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్
సెల్ నంబర్ 9701249103

# నేషనల్ డెయిరీతో నార్ముల్ ఒప్పందం

## పాడిరైతులకు తొలుత పదికోట్లు చెల్లింపు




**హైదరాబాద్, మే 12 (జర్నలిస్ట్ వార్త):** నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్ముల్), నేషనల్ డెయిరీ డెవలంప్‌మెంట్ బోర్డుతో త్రైపాక్షిక ఒప్పందం కుదర్చుకుంది. 15 ఏళ్లపాటు డెయిరీ అభివృద్ధి చేసే బాధ్యతను అది తీసుకోనుంది. ఒప్పందంలో భాగంగా మొదట పాడి రైతుల బకాయిలను చెల్లించేందుకు రూ.10 కోట్ల రూపాయలను చెల్లించనుంది. ఈ మేరకు ఎన్‌డిబిబి అధికారులతో తెలంగాణ రాష్ట్ర డెయిరీ విభాగం అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఔఆఆః అధికారులు పాల్గొన్నారు.

# చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ

## ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం

## అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష

**హైదరాబాద్, మే 12 (జర్నలిస్ట్ వార్త):**



తెలంగాణ రాష్ట్రంలో చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల సమీక్షా సమావేశం మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించారు.

ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్స్ అథారిటీ కార్యకలాపాలు, వెట్‌ల్యాండ్స్ కాలుష్య నియంత్రణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు. ఈ సమావేశానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల పునరుద్ధరణ, అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. వెట్‌ల్యాండ్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అక్రమ నిర్మాణాలు, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పక్షులు, జలచరాలు, పర్యావరణ సమతుల్యతకు వెట్‌ల్యాండ్స్ కీలకమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో వెట్‌ల్యాండ్స్ పాత్ర అత్యంత ముఖ్యమని, వాటి సంరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వెట్‌ల్యాండ్స్ మ్యాపింగ్, మానిటరింగ్ పక్రియపై కూడా సమావేశంలో చర్చించారు. చెరువుల స్థితిగతులు, ఆక్రమణలు, కాలుష్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షించాలని అధికారులు అభిప్రాయపడ్డారు. చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంరక్షణలో కూడా వెట్‌ల్యాండ్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెట్‌ల్యాండ్స్ సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, జీవ వైవిధ్య పరిరక్షణలో కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

---------------------

# చిన్నారి హత్య కేసులో నిందితుడికి మరణ శిక్ష

## కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్, మే 12 (జర్నలిస్ట్ వార్త):** ఓ బాలుడి హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. చిన్నారిని హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష విధించింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లో 2023 సంవత్సరంలో జరిగిన మైనర్ హత్యోదంతం సంచలనం సృష్టించింది. ఇమ్రాన్ అలీ ఖాన్ (33) అనే వ్యక్తి చిన్నారిని హత్య చేయగా.. అతనికి మహమ్మద్ రఫీక్ (32) సహకరించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీసులు అప్పుడే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఇమ్రాన్ అలీ ఖాన్, మహమ్మద్ రఫీక్‌ను గుర్తించి అరెస్టు చేశారు. కేవలం సాంకేతిక సాక్ష్యాలతో కేసును ఛేదించి.. వివరాలను కోర్టుకు సమర్పించారు. పకడ్బందీగా సాక్ష్యాలు ఉండటంతో సంతృప్తి చెందిన కూకట్‌పల్లి కోర్టు.. చిన్నారిని వారే హత్య చేసినట్లు నిర్ధారిస్తూ దోషులుగా తేల్చింది. ఇమ్రాన్ అలీ ఖాన్‌కు మరణశిక్ష, అతనికి సహకరించిన మహమ్మద్ రఫీక్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటేశ్వర రావు తీర్పు వెలువరించారు.

# చట్టానికి నా కొడుకు అతీతుడేమీ కాదు

## కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ



**కరీంనగర్, మే 12 (జర్నలిస్ట్ వార్త):** తన కుమారుడు బండి భగీరథ్‌ను నేరస్థుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆవేదన చెందారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో సంజయ్ స్పందించారు. ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. నా కుమారుడిపై దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది.. డిప్రెషన్‌లోకి పోతోంది. నేను బాధపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారు. నేనెప్పుడూ బాధపడను. కుట్రలు, కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టను అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. చట్టం అందరికీ ఒక్కటేనని, తన కొడుకైనా మరెవరైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.